క్లుప్తంగా

సేఫ్టీ మిర్రర్ బాక్స్ ఏర్పాటు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే-5 షాఫ్ట్ గనిలో 'నా సేఫ్టీ – నా బాధ్యత' అంశంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సేఫ్టీ జీఎం కుమారస్వామి సేఫ్టీ మిర్రర్ బాక్స్‌ను ప్రారంభించి మాట్లాడారు. గనిలో దిగే ప్రతి కార్మికుడు బాక్స్‌ను తెరిచి చూడాలని సూచించారు. కార్యక్రమంలో రవీందర్, పాలడుగు శ్రీనివాస్, షాకీర్‌మొయినుద్దీన్, చిలక రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

చైతన్యపరిచిన గద్దర్

కొత్తగూడెంటౌన్: ప్రజా గాయకుడు, ఉద్యమనాయకుడు గద్దర్ మరణం తీరనిలోటని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ శ్రావణ బోయిన నర్సయ్య అన్నారు. కొత్తగూడెంలోని కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక పోరాటాల్లో ప్రజలను తన పాటలతో గద్దర్ చైతన్యపరిచారని గుర్తుచేశారు. సమావేశంలో నాయకులు ఎం.వలీబాబా, కూచన కృష్ణ, అల్లి భాస్కర్‌రావు, శ్రీపాద సత్యనారాయణ, సప్తార్‌బేగ్, అలీముద్దీన్, జావేద్ మౌలానా, ఏలూరు రాములు, ఎడ్ల ఎలియా, డి.మల్లయ్య, లక్ష్మీనారాయణ, మంజు, క్రాంతి పాల్గొన్నారు.

గౌరవ వేతనం మంజూరుపై హర్షం

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్రంలో ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనాలను మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంపై జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో 9,995 మంది గౌరవ వేతనాలు పొందుతుండగా, తాజా నిర్ణయంతో మరో 7 వేల మందికి అవకాశం లభిస్తుందని తెలిపారు. అయితే, గౌరవ వేతనాలు రెండు నెలలకోసారి కాకుండా ప్రతినెల జమ చేయాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

బ్రిడ్జి నిర్మాణానికి కృషి

ఇల్లెందు: ప్రజల చెంతకు పాలక వర్గం అనే కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు.. కౌన్సిలర్లు, అధికారులతో కలిసి పట్టణంలోని 2వ వార్డులో రెండో రోజు పర్యటించారు. మంగళవారం ఇల్లెందులపాడులోని గాంధీసెంటర్ నుంచి ప్రారంభించి ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. అంకుషావలి, కటకం పద్మావతి, శ్రీనివాస్, రాధాకృష్ణ, శంకర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న అవగాహన

టేకులపల్లి: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండలంలోని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఈవీఎం వినియోగంపై ఈ నెల 2న ప్రారంభమైన అవగాహన కార్యక్రమం కొనసాగుతోంది. మంగళవారం సులానగర్, శాంతినగర్, బేతంపూడి, వెంకట్యాతండా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవగాహన కల్పించారు. జయకృష్ణ, సర్పంచ్‌లు అజ్మీర బుజ్జి, వై.బాబు, బీఎల్‌ఓలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

జామాయిల్ మొక్కలు ధ్వంసం చేశారని ఫిర్యాదు

పాల్వంచరూరల్: భూమిని అక్రమంగా దున్నడమే కాక రూ.లక్ష విలువైన జామాయిల్ మొక్కలు ధ్వంసం చేశారని రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని ప్రభాత్‌నగర్ శివారు ఐదెకరాల్లో రైతు కల్లెం వీరారెడ్డి జామాయిల్ మొక్కలు సాగుచేశారు. అయితే, సోమవారం పలువురు తన భూమిలో దున్ని మొక్కలను ధ్వంసం చేశారని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో హెడ్ కానిస్టేబుల్ రాములు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. విచారణ చేస్తున్నామని ఎస్‌ఐ కార్తీక్ తెలిపారు.

అమ్మపాలే అమృతం

ఇల్లెందురూరల్: చిన్నారులకు పోతపాల కంటే తల్లిపాలే అమృతం వంటివని సీడీపీఓ లక్ష్మీప్రసన్న అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో తల్లిపాల ప్రాధాన్యతను వివరిస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలు తాగిస్తే వ్యాధినిరోధకత పెరుగుతుందని గుర్తుచేశారు. రెండేళ్ల వరకు తల్లిపాలు తాగిస్తే బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతాడని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తగూడెం పట్టణంలో..

కొత్తగూడెంటౌన్: తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇస్తాయని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీత తెలిపారు. ఐడీసీఎస్ కొత్తగూడెంఅర్బన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మధురబస్తీలోని సెక్టార్-1లో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీత మాట్లాడారు. ప్రతీ బిడ్డకు తల్లిపాలే శ్రీరామరక్ష అని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ ప్రతిభాభారతి, ఆయా వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి: ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు పరిధిలోని టేకులపల్లి సెక్టార్ బేతంపూడి పంచాయతీ వెంకట్యాతండా స్టేజీ అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ అనురాధ ఆధ్వర్యంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుగుణ, స్వరూప, రాణి, లలితకుమారి, నర్సమ్మ పాల్గొన్నారు.

'బూడిద'లో ముంచారు..

- ఉచితంగా బూడిద ఇస్తామని కొన్నాళ్లకే మొండిచేయి
- కేటీపీఎస్ అధికారుల తీరుతో ఉపాధికి దూరం
- ఆవేదన చెందుతున్న ఇటుక పరిశ్రమల యజమానులు, కార్మికులు
- మూతబడే దశకు చేరుతున్న బ్రిక్ ఫ్యాక్టరీలు



వెలవెలబోతున్న బూడిద ఇటుకల ఫ్యాక్టరీ

పాల్వంచ: రాష్ట్రానికి వెలుగులు పంచుతున్న కేటీపీఎస్ కర్మాగారం స్థానికులకు మాత్రం కాలుష్యాన్ని వెదజల్లుతోంది. సీఎస్ఆర్ పాలసీ ద్వారా విడుదలయ్యే నిధులను ఈ ప్రాంత అభివృద్ధికి వెచ్చించాల్సింది పోయి అంతర్ జిల్లాల్లో పనులకూ ఖర్చు చేస్తున్నారు. ఇదిలా ఉండగా కేటీపీఎస్ నుంచి వెలువడే బూడిదను గతంలో స్థానిక పరిశ్రమలకు ఉచితంగా అందించేవారు. కానీ, గత మార్చి 31 నుంచి బూడిద ఉచిత పంపిణీని నిలిపేశారు. దీంతో బూడిద ఇస్తారనే నమ్మకంతో ఇటుక ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసిన యజమానులు, వాటిపై ఆధారపడిన కార్మికులు ఉపాధి కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొనడంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

నాడు ప్రోత్సాహం.. నేడు నిరుత్సాహం

కేటీపీఎస్ 5, 6, 7వ దశల కర్మాగారాల ద్వారా 1,800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. ఈ కర్మాగారాల్లో బొగ్గును మండించడం ద్వారా బూడిద విడుదలవుతోంది. బూడిదను కొంత వరకు పైపులైన్ల ద్వారా పుల్లాయిగూడెం, సూరారం గ్రామాలకు చేరువలో ఉన్న చెరువులకు వదులుతారు. పొడిగా ఉండే బూడిదను సైలోల ద్వారా ట్యాంకర్లలో నేరుగా నింపుతున్నారు. అయితే, బూడిద శాతాన్ని తగ్గించి కాలుష్యాన్ని అరికట్టాలనే ఉద్దేశంతో పాటు స్థానికులకు ఉపాధి కల్పించాలన్న సంకల్పంతో కొత్తగూడెం, పాల్వంచ చుట్టుపక్కల ఉన్న ఇటుక ఫ్యాక్టరీలు, ఇతర చిన్న తరహా పరిశ్రమలకు ఉచితంగా బూడిద అందిస్తామని ప్రకటించారు. దీంతో పలువురు ఇటుక ఫ్యాక్టరీలు ఏర్పాటు చేశారు. కానీ, కొన్నేళ్లకు ఉచిత పంపిణీని నిలిపేయడంతో ఇప్పుడు పరిశ్రమలు ఏర్పాటుచేసిన వారు.. అందులో పనికి కుదిరిన కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ధరలన్నీ పైపైకి..

ఉచిత బూడిద అందకపోగా ఇతర ముడిసరుకుల ధరలు కూడా పెరిగాయి. జిప్సం ధర గతంలో రూ.1,600 ఉండగా నేడు రూ.3 వేలకు పెరిగింది. సున్నం(లైమ్) ధర రూ.1,500 నుంచి రూ.5 వేలకు చేరింది. ఇవి కాక ఇటుక తయారు చేసే కూలీలను ఇతర ప్రాంతాల నుంచి అడ్వాన్స్ ఇచ్చి మరీ తీసుకొచ్చి వసతి కల్పించారు. రోజూ ఒక్కొక్కరికి రూ.500 తగ్గకుండా కూలీ పడేలా పనిచేయించుకోవాల్సి ఉంటుంది. ఇవేకాక కరెంట్ బిల్లులు ఇతర ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి. దీంతో ఇటుక ఫ్యాక్టరీల యజమానులు నష్టాలను ఎదుర్కోలేక మూసివేతకు సిద్ధమవుతున్నారు.

బడా కంపెనీలకే మొగ్గు

స్థానిక పరిశ్రమలకు బూడిద పంపిణీని నిలిపివేసినా.. బయట పెద్ద పరిశ్రమలకు మాత్రం టన్ను రూ.254 చొప్పున అమ్ముతున్నారు. చెరువుల్లో కలిపే బూడిదను ఆన్‌లైన్ టెండర్ల ద్వారా ఏజెన్సీల ద్వారా బయటకు పంపిస్తున్నారు. ఈ క్రమంలో అధికారులు భారీ ఎత్తున మామూళ్లు పుచ్చుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. కాగా, స్థానిక కంపెనీలకు బూడిద ఇచ్చేందుకు అనుమతి కోసం కొంతకాలంగా స్థానికులు జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కానరాలేదు. ఇకనైనా యాజమాన్యం స్థానిక ఫ్యాక్టరీలకు ఉచితంగా బూడిద పంపిణీ చేయడంతో పాటు బినామీ కంపెనీల పేరిట తరలిస్తున్న బూడిద విషయమై చర్యలు తీసుకునేలా చూడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



ఉచితంగా బూడిద పంపిణీని నిలిపేశారు. దీనికితోడు జిప్సం సున్నం, బాటం యాష్ ధరలు అమాంతం పెరిగాయి. ఫలితంగా ఇప్పటికే నష్టాల్లో ఉన్న మేం పరిశ్రమ నడపలేని పరిస్థితి నెలకొంది. గతంలో బ్రిక్ ఫ్యాక్టరీలు పెట్టుకోవాలని ప్రోత్సహించిన యాజమాన్యమే మమ్మల్ని ఆదుకోవాలి.

–జి.మధుసూదన్‌రెడ్డి, బ్రిక్ ఫ్యాక్టరీ యజమాని

అనుమతి గడువు ముగిసింది



లోకల్ ఫ్యాక్టరీల నిర్వాహకులకు బూడిద ఇచ్చేందుకు ఉన్న అనుమతుల గడువు గత మార్చి 31తో అయిపోయింది. దీనిని రెన్యూవల్ చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ యాజమాన్యం పరిధిలో ఉంది. యాజమాన్యం మళ్లీ అనుమతులు జారీ చేస్తే తప్ప బూడిద ఇవ్వడం కుదరదు.

–డి.ప్రభాకర్‌రావు, కేటీపీఎస్ 5, 6వ దశల సీఈ

దరఖాస్తు గడువు పొడిగించాలి

కొత్తగూడెంఅర్బన్/జూలూరుపాడు/కొత్తగూడెం టౌన్/సింగరేణి(కొత్తగూడెం): ఇల్లు లేని పేదల కోసం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం దరఖాస్తుకు గడువును మరింత పొడిగించాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రా కామేశ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్యూన్‌బస్తీ 5వ వార్డులో ఇంటింటికీ బీఎస్పీ కార్యక్రమంలో భాగంగా ఆయన కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. దరఖాస్తుకు కేవలం మూడు రోజుల గడువు ఇవ్వడం సరికాదన్నారు. గడువు పెంచితే తప్ప అర్హులకు లబ్ధి జరగదని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్‌రావు, మాలోత్ వీరునాయక్, నాగుల రవికుమార్, గుడివాడ రాజేందర్, వంగా రవిశంకర్ పాల్గొన్నారు. అలాగే, గృహలక్ష్మి దరఖాస్తు గడువు మరికొన్ని రోజులు పొడిగించాలని సీపీఐ నేత జి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. జూలూరుపాడులో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడగా ఎస్కే.చాంద్‌పాషా, సిరిపురపు వెంకటేశ్వర్లు, పగడాల అఖిల్, పసుపులేటి పవన్, పాల్గొన్నారు. కాగా, నిరుపేదలకు లబ్ధి జరిగేలా ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం దరఖాస్తుకు మరిన్ని రోజులు అవకాశం కల్పించాలని మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్తావరపు జానకీరాం, సీపీఎం జిల్లా నాయకుడు ఎస్కే నబీ, ప్రజాపంథా నాయకులు ఎస్కే యాకూబ్‌షావలి వేర్వేరు ప్రకటనల్లో కోరారు. కాగా, దరఖాస్తు గడువు పెంచాలని సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వై.శ్రీనివాసరెడ్డి కోరారు. కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, భూక్యా దస్రు, జక్కుల రాములు, పల్నాటి ప్రశాంత్, కొచ్చెర్ల జోసెఫ్, కొమారి కృష్ణ పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

సుజాతనగర్/ఇల్లెందురూరల్/టేకులపల్లి/ఇల్లెందు/కొత్తగూడెంరూరల్: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సుజాతనగర్, ఇల్లెందు, టేకులపల్లి, లక్ష్మీదేవిపల్లి ఎంపీడీఓలు టి.వెంకటలక్ష్మి, బాలరాజు, కోట వీరబాబు, రమేశ్‌తో పాటు ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. మహిళ పేరుతో సొంత ఇంటి స్థలం, స్థల ధ్రువీకరణ పత్రం, రేషన్, ఆధార్ కార్డులు, నివాస, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు బ్యాంక్ ఖాతా జిరాక్స్, రెండు ఫొటోలు జత చేసిన దరఖాస్తులను ఈ నెల 10వ తేదీ సాయంత్రంలోగా ఎంపీడీఓ కార్యాలయంలో కానీ, పంచాయతీ కార్యాలయంలో కానీ అందజేయాలని సూచించారు. ఒకవేళ ఇంట్లో మహిళలెవరూ లేకపోతే పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

ముమ్మరంగా వైద్యశిబిరాలు



టేకులపల్లి: లాక్యాతండాలో ప్రజలకు పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

టేకులపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు గాను సులానగర్ పీహెచ్‌సీ సిబ్బంది వైద్యశిబిరాలు నిర్వహించారు. టేకులపల్లి వైద్యాధికారి కె.దినేశ్ సూచనలతో తుమ్మలచలక, రోడ్డుగుంపు, కొత్తతండా, చింతోనిచలక, లక్యాతండా, బొమ్మనపల్లి, దుబ్బతండ, కొప్పురాయి గ్రామాల్లో మంగళవారం వైద్యశిబిరాలు నిర్వహించడమే కాక వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పల్లె దవాఖానాల వైద్యులు ధరణి, అమూల్య, రుక్సానా, శైలజ, ఇంద్రజ, చందన, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సీతమ్మ, వజ్జా పార్వతి, ఉద్యోగులు గన్యా, పోరండ్ల శ్రీనివాస్, నాగుబండి వెంకటేశ్వర్లు, వీసం శకుంతల, గుజ్జ విజయ, స్వప్న, అరుణాదేవి, కళావతి, అనసూయ, లక్ష్మీబాయి, కృష్ణవేణి, సుజాత, కమల అరుణకుమారి, ఫాతిమా బేగం, స్రవంతి పాల్గొన్నారు.

గుండెపుడిలో..

జూలూరుపాడు: వర్షాకాలంలో వచ్చే సీజనల్, అంటువ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని జూలూరుపాడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గుండెపుడి గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి, ప్రజలకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎస్ రత్నకుమార్, ఏఎన్‌ఎంలు రాజమ్మ, సుశీల పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే బలహీనవర్గాలకు న్యాయం




దంతలబోరులో మాట్లాడుతున్న ఎడవల్లి కృష్ణ

పాల్వంచరూరల్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ తెలిపారు. గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి మాట్లాడారు. ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధికి కాంగ్రెస్సే కారణమని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేయడం ఖాయమని, తనను గెలిపించాలని కోరారు. నాయకులు గద్దల రమేశ్, నూకల రంగారావు, కొండం వెంకన్నగౌడ్, బత్తుల వెంకటేశ్వర్లు, కిషన్ నాయక్, మెంటం రాము తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో నేడు పలువురి చేరిక

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బుధవారం కాంగ్రెస్‌లో చేరనున్నారని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య తెలిపారు. మండలంలోని మాణిక్యారంలో సభ నిర్వహణకు జరుగుతున్న ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. సభలో ముఖ్య అతిథిగా కాంగ్రెస్ ఎన్నికల ప్రచార కమిటీ కోకన్వీనర్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరతారని చెప్పారు. నాయకులు మండల రాము, పూనెం సురేందర్, పాయం కృష్ణప్రసాద్, మడుగు సాంబమూర్తి, బోళ్లసూర్యం, చిల్లా శ్రీనివాస్, ఆముదాల ప్రసాద్, వెంకన్న, రావూరి సతీశ్, శేఖర్ పాల్గొన్నారు.


దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ



ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యులు

సుజాతనగర్: దివ్యాంగ విద్యార్థులకు ప్రతి మంగళవారం ఆయా పాఠశాలల్లో ఫిజియో థెరపీ సేవలను అందిస్తున్నట్లు జిల్లా సమ్మిళిత విద్యా కోఆర్డినేటర్ ఎస్కే సైదులు తెలిపారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ క్యాంపును ఆయన మంగళవారం సందర్శించి మాట్లాడారు. జిల్లాలో 18 ఏళ్ల లోపు దివ్యాంగులు 1,807 మంది ఉన్నారని, వారిలో 1,216 మంది పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారని, భవిత కేంద్రాల్లో సమ్మిళిత విద్య రిసోర్స్ పర్సన్ల ద్వారా 212 మంది పిల్లలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ జ్యోతి, హెచ్‌ఎం నేతాజీ, శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

వనమాకు ఘనస్వాగతం పలుకుదాం



మాట్లాడుతున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ: సుప్రీంకోర్టు ఉత్తర్వుల అనంతరం హైదరాబాద్ నుంచి ఈ నెల 10వ తేదీన కొత్తగూడెం వస్తున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుకు ఘనస్వాగతం పలకాలని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పాత పాల్వంచలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుజాతనగర్ నుంచి మొదలయ్యే స్వాగత ర్యాలీకి బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మంతపురి రాజుగౌడ్, నాయకులు ఎస్‌వీఆర్‌కే.ఆచార్యులు, మల్లెల శ్రీరామ్మూర్తి, బత్తుల మధుచంద్, మహిపతి రామలింగం, విజయ్, బండి చిన్నవెంకటేశ్వర్లు, సత్యనారాయణ, ప్రకాశ్‌రావు, బాలకృష్ణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చేపల సొసైటీ రద్దు చేయాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న పోచారంతండావాసులు

ఇల్లెందురూరల్: మత్స్యశాఖ, గ్రామ పంచాయతీ అధికారులు సంయుక్తంగా నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన చేపల సొసైటీని రద్దు చేయాలని కోరుతూ మండలంలోని పోచారంతండా గ్రామ పంచాయతీలో గ్రామస్తులు మంగళవారం ఆందోళన చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నినాదాలు చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. చేపల సొసైటీ సభ్యుల ఎంపికకు సంబంధించి గ్రామంలో టాంటాం నిర్వహించాల్సి ఉన్నప్పటికీ అవేమీ పాటించకుండా అధికారులు ఏకపక్షంగా ప్రక్రియ పూర్తిచేశారని ఆరోపించారు. కార్యక్రమంలో వాంకుడోత్ శ్రీను, జర్పుల బాబూలాల్, గుగులోత్ రాందాస్, వాంకుడోత్ రవి, ఇస్లావత్ సతీశ్, బానోత్ సుధాకర్, ఇస్లావత్ వెంకన్న, వాంకుడోత్ దేవ్లా, బానోత్ వెంకన్న, బోడ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ వినతి

టేకులపల్లి: ఉపాధ్యాయులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని, 30 శాతం ఐఆర్ ఇవ్వాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ రవి డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ అంజత్‌పాషాకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నర్సయ్య, రవీందర్, విజయనిర్మల, ప్రసాద్, జి.మోతీలాల్, సర్కార్, రమేశ్‌బాబు, బాలాజీ, లక్ష్మణ్, వేణుగోపాల్‌రెడ్డి, హరిప్రియ, దస్రు, ఇస్తెరమ్మ, బాలాజీ పాల్గొన్నారు.

12న చలో హైదరాబాద్

టేకులపల్లి: కొత్త పింఛన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనే డిమాండ్‌తో ఈ నెల 12న హైదరాబాద్‌లో నిర్వహించే నిరసనకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ నాయకులు కోరారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బి.పూల్‌సింగ్, ఎం.రమణ, వి.హత్తీరాం, బి.నాగునాయక్ పాల్గొన్నారు.

సెకండ్ ఏఎన్‌ఎంల నిరసన

జూలూరుపాడు: కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌తో మంగళవారం జూలూరుపాడులో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎంలు మాట్లాడుతూ 15 ఏళ్లుగా కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న తమను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో బానోత్ పార్వతి, బానోత్ రీనా, అజ్మీరా రాణి, బానోత్ జీజ, ముక్తి సావిత్రి, ఇరప అనూష, బొమ్మల పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు తీసుకెళ్లండి..

టేకులపల్లి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో కొన్నేళ్లుగా వివిధ కేసుల్లో పట్టుబడిన, సీజ్ చేసిన వాహనాలను సంబంధిత యజమానులు రిలీజింగ్ ఆర్డర్ తెచ్చుకుని తీసుకెళ్లొచ్చని ఎస్‌ఐ గన్‌రెడ్డి రమణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బైక్‌లు, ఆటోలు, టాటామేజిక్‌లు, ట్రాక్టర్, లారీ ఉన్నాయని, ఎలాంటి అపోహలకు తావులేకుండా నిర్భయంగా సంబంధిత వాహన యజమానులు రిలీజింగ్ ఆర్డర్లు తీసుకుని రావాలని విజ్ఞప్తి చేశారు.

నాట్య కళాకారులకు సువర్ణ కంకణ అవార్డు

పాల్వంచ: పట్టణంలోని ప్రముఖ నాట్య కళాకారులు మారీదు శాంతిమోహన్, అతడి కుమార్తె, మనవరాలు సువర్ణ కంకణ అవార్డులు అందుకున్నారు. ఈ నెల 6వ తేదీన సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో లలిత కళా సమాఖ్య, రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ నాట్య కళాకారులకు సువర్ణ కంకణ అవార్డులు ప్రదానం చేశారు. పాల్వంచకు చెందిన ప్రముఖ నాట్య కళాకారులు శాంతిమోహన్, అతడి కుమార్తె కోలగాని మాధవీలత, మనవరాలు భవితశ్రీ అవార్డులు అందుకున్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): కార్మికవాడల్లో పనులు చేస్తున్న తమ శ్రమను సింగరేణి యాజమాన్యం దోపిడీ చేస్తోందని కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం నాయకులు ఆరోపించారు. మంగళవారం కొత్తగూడెం రామవరంలోని అంబేడ్కర్ చమన్‌లో కార్మికులు మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపిన అనంతరం మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం కార్మికులతో వెట్టిచాకిరీ చేయిస్తూ, సరైన వేతనం చెల్లించడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీఓ 60 ఆధారంగా వేతనాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో గూడెల్లి యాకయ్య, జాటోత్ అనిల్, సాజిత్, షకీల్, రంగారావు, ఆదాం శ్రీను, కుమారి, సమ్మక్క, మందా శ్రీను, శంకర్, రంగారావు, పాల్గొన్నారు.

సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలి



ధర్నా చేస్తున్న ఎన్డీ నాయకులు, రైతులు

జూలూరుపాడు: 40 ఏళ్లుగా సాగులో ఉన్న పాత భూములకు, ఆదివాసీ గిరిజనులు, నిరుపేదలు సాగు చేస్తున్న పోడు భూములకు సర్వే నిర్వహించి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి ఎస్కే ఉమర్, మండల కార్యదర్శి వల్లోజి రమేశ్ మాట్లాడుతూ.. గుండ్లరేవు, భేతాళపాడు గ్రామాల్లో ఎన్నో ఏళ్లుగా సాగులో ఉన్న భూములకు పట్టాలు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అనంతరం తహసీల్దార్ శారదకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఈసాల ఎర్రయ్య, మడి అప్పారావు, గొగ్గల భద్రయ్య, తెల్లం రామారావు, మల్కం సుశీల, కమలమ్మ, మడి అన్నపూర్ణ, బొర్రా కృష్ణయ్య, తెల్లం సులోచన, ఝాన్సీ, నాగరత్నం పాల్గొన్నారు.

గిరిజన రైతులకు రుణమాఫీ చేయాలి

జూలూరుపాడు: గిరిజన రైతులకు సంబంధించి రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవిచందర్‌చౌహాన్ డిమాండ్ చేశారు. జూలూరుపాడులో మంగళవారం జరిగిన సమావేశంలో ఈ నెల 25న జరగనున్న చలో ప్రగతిభవన్ ముట్టడి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవిచందర్ మాట్లాడుతూ గిరిజన రైతుల పోడు భూముల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని, సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా ఫిబ్రవరి 15న సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దుర్గాప్రసాద్, బోడ రవితో పాటు నాయకులు మాలోత్ రాందాస్‌నాయక్, బానోత్ రాంబాబునాయక్, గణేశ్‌నాయక్, దేవీలాల్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా స్తంభం



పాల్వంచ మండలంలోని సూరారం వైపు వెళ్లే ప్రధాన రహదారి కేటీపీఎస్ 5వ దశ కర్మాగారం రెండో గేట్ సమీపాన 33 కేవీ విద్యుత్ లైన్‌కు చెందిన స్తంభం ఒరిగి కూలేందుకు సిద్ధంగా ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. స్థానికులు స్తంభాన్ని మార్చాలని అధికారులను కోరినా స్పందించలేదు. ఏదైనా ప్రమాదం జరగకముందే స్తంభాన్ని మార్చాలని వారు కోరుతున్నారు.

–పాల్వంచరూరల్

ప్రశ్నించాల్సిన అధికారి : రవీందర్, విద్యుత్‌శాఖ ఏఈ
సెల్ నంబర్ : 94408 11564